కథ

# దేవుడు

కల్లం శివకుమారి



ఆఫీసుకి బయలుదేరబోతున్న రఘురామ్‌తో "ఏమండీ! ఇంటికి వచ్చేటప్పుడు కలర్ టి.వి తీసుకురండి" అంది భార్య సుభద్ర.

"నా వద్ద అంత డబ్బు లేదు" అన్నాడాయన.

"అయితే ఉద్యోగం ఎందుకు?"

"బతకడానికి"

"ఉద్యోగం లేకపోతే బతకలేమా?"

"ఏమిటే నువ్వనేది?" అన్నాడు విసుగ్గా.

"ఏమిటా...సక్రమ మార్గంలో వెళ్తున్న

తమరి పెన్నుని కొంచెం దారి మళ్లించండి అంటున్నాను" అంది భార్య.

రఘురామ్ ఆశ్చర్యపోయి "అంటే లంచం తీసుకోమంటావా?" అన్నాడు.

"మీరు ఎలా అనుకున్నా నా కిష్టమే"

"లంచం తీసుకోవడం తప్పు కదూ సుభద్రా"

"మీరు అలా మడి కట్టుకొని కూర్చోబట్టే మన బతుకు ఇలా తగలబడింది" అంది కోపంగా.


"ఇప్పుడేమైంది మనకి. బాగానే బతుకుతున్నాం కదా" సౌమ్యంగా చెప్పాడు.

భర్త అన్న మాటలకి సుభద్రలో ఆవేశం ఆకాశాన్ని తాకింది. "చేసేది పెద్ద రెవిన్యూ ఆఫీసరు వుద్యోగం. ఇంట్లో ఏ వెలకు ఆ వెలే. మీ క్రింద పనిచేసే అటెండరు ప్రసాద్‌ని చూడండి. కొత్తగా ఇల్లు కట్టుకొని దర్జాగా ఎలా బతుకుతున్నాడో? వాళ్లింట్లో లేని వస్తువు అంటూ ఏమీ లేదు. మొన్ననే వాళ్లావిడకి పది సవర్ల బంగారం కూడా కొన్నాడు. మీరు వున్నారెందుకు? పెళ్లయి ఇన్నాళ్లయినా ఒక్క పట్టుచీరె కూడా కొనలేదు. అటెండరు భార్య అయినా ఆమెకి నలుగురిలో వున్న గౌరవం ఆఫీసరు భార్యగా నాకు లేదు. మనం ఎప్పుడూ పేదోళ్లమే" అని ఏడుపు మొహం పెట్టింది.

రఘురామ్ నవ్వుతూ భార్యని దగ్గరికి తీసుకొని "చూడు సుభద్రా! మనిషి లేని వాటి కోసం ఆశపడే కంటే వున్న దానితో తృప్తి పడడం ముఖ్యం. మనకి పెళ్లయినప్పుడు తిండికి కూడా లేని పేదోళ్లం. అప్పుడు నువ్వేమన్నావో గుర్తుందా! ఏదైనా చిన్న ఉద్యోగం వచ్చి మన ఇంటి అవసరాలు తీరితే చాలు అన్నావు. ఇప్పుడు పెద్ద ఉద్యోగం వచ్చి ఇంటి అవసరాలు ఏలోటు రాకుండా తీరుతున్నాయి. అయినా తృప్తి లేదు. ఇంటి అవసరాలు తీరుతున్నాయి కాబట్టి సౌకర్యాలు తీరాలి అంటావు. రేపు సౌకర్యాలు తీరిన తర్వాత విలాసాలు అంటావు. ఇలా ఒకదాని తర్వాత ఒకటి మనసు కోరుతూనే ఉంటుంది. ఇవన్నీ నిజాయితీగా సంపాదించుకుంటే తప్పులేదు. ఒకరి పొట్ట కొట్టి సంపాదించడం తప్పు. మనిషికి నిజమైన తృప్తి నిజాయితీగా బతకడంలోనే వుంటుంది. ఏమంటావ్?..."అన్నాడు.

సుభద్ర ఆవేశంగా భర్త చేతుల్ని విదిలించుకొని "ఈ శ్రీరంగనీతులు పెళ్లయిన దగ్గర్నుంచీ వినలేక చస్తున్నాను. నేను చెప్పినట్లుగా సంపాదిస్తే సరి. లేకపోతే ఇప్పుడే పిల్లలని తీసుకొని పుట్టింటికి వెళ్తాను" అంది.

"నన్ను, నా నిజాయితీని ప్రేమించకుండా నా అక్రమార్జన ద్వారా వచ్చే డబ్బే నీకు ముఖ్యం అనుకుంటే, నువ్వు నాకు అక్కర్లేదు. నా నిజాయితీని ప్రేమించినప్పుడే నా ఇంటి గడప తొక్కు. వెళ్లు..."అన్నాడు ఆవేశంగా రఘురామ్.



### విదేశాల హీరోలు

హీరోనో, దర్శకుడో ఏదైనా ఓ దేశం మీద మోజు ఉండి షూటింగు అక్కడ చేసుకొన్నారనుకోండి పొరపాట్న ఆ సినిమా హిట్ అయితే ఇక అంతే మన వాళ్లంతా అదృష్టం ఆ దేశంలోనే ఉందనుకుని పొలోమని అక్కడికి పోయి షూటింగ్ చేసుకుని వచ్చేస్తున్నారు. అందుకే ఇటీవల చిరంజీవి, వెంకటేష్‌ల సినిమాలు న్యూజిలాండ్‌లో తీస్తున్నారు. మిగిలిన పెద్ద హీరోలు కూడా వరసలోనే ఉన్నారట.

సుభద్ర కోపంగా పిల్లల్ని తీసుకొని బైటికి అడుగుపెట్టింది.

** ** **

సుభద్ర పుట్టింటివారు కూడా ఆమెనే సమర్థించారు. సంపాదించుకోక పోవడం రఘురామ్ చేతకాని తనం అన్నారు. ఒకరోజు మధ్యాహ్నం ఇంటి ప్రక్కనున్న పాకలో నుండి బిగ్గరగా మాటలు వినబడ్డాయి. ఏమిటోనని సుభద్ర కిటికీ దగ్గరికెళ్లింది. అక్కణ్ణుంచి చూస్తే పాకలో వాళ్ల మాటలే కాదు మనుషులు కూడా స్పష్టంగా కనిపిస్తారు.

"ఎందుకింత తప్పుడు పనిచేశావయ్యా?" అంటుంది ఒకామె.

"మనకోసమేనే" అన్నాడు ఒకాయన.

"మనకోసమెందుకు?"

"దర్జాగా బతకడం కోసం"

"అందుకని తప్పుడు పని చేస్తావా"

"అది కాదే లచ్చాలూ..."

"ఏది కాదు. తప్పుడు పని చేయడానికి సిగ్గుగా లేదు. ఇప్పుడు మనం ఉన్నంతలో తృప్తిగానే బతుకుతున్నాం. లేని దర్జాలు మనకి ఎక్కడి నుండి వస్తాయి. ఆ చెట్టు క్రింద వుండేవారి కంటే మనమే మిన్నగా బతుకుతున్నాం. మనకంటే గొప్పవారిని చూసి తప్పుడు పనులు చేసి బతకడం కంటే, మనకంటే క్రిందివారిని చూసి నిజాయితీగా బతకడం మంచిది. నువ్వు కష్టపడి నాలుగు కారపు మెతుకులు పెట్టినా నాకు తృప్తిగానే వుంటుంది. వెళ్లి వారి డబ్బు వారికిచ్చిరా..."అంది ఆవేశంగా.

డబ్బు మూటతో బైటికొచ్చాడు ఆమె భర్త.

"ఏమిటి సుభద్ర అక్కడ నిలబడ్డావు?" అంటూ వచ్చింది తల్లి. వాళ్ల గురించి అడిగింది సుభద్ర. "వాళ్లది చాలా బీద కుటుంబం. చదువుకోకపోయినా లౌక్యం తెలిసిన వాళ్ళు. ముగ్గురు ఆడపిల్లలు. రెక్కాడితే గాని డొక్కాడదు. అయినా చాలా నీతిగా బతుకుతారు. వున్నదానితోనే సర్దుకుంటారు. పని లేకపోతే పస్తులయినా వుంటారు కానీ చెయ్యి చాపి ఎవరినీ యాచించరు. అందుకే ఈ వీధిలో వారందరికీ వాళ్లంటే ప్రత్యేకమైన అభిమానం. వాళ్ల పేర్లు లచ్చాలు, సాంబయ్య" అంది తల్లి. తిరిగి వచ్చిన సాంబయ్య భార్య, పిల్లలతో కలిసి భోంచెయ్యసాగాడు. కారపు మెతుకులను ముద్దలుగా చేసి ఒకరి కళ్లల్లోకి ఒకరు చూసుకుంటూ తింటున్న ఆ పీక్కుపోయిన మొహాల్లో కోటీశ్వరులలో లేని తృప్తి, ఆనందం కనిపిస్తుంది.

** ** **

బుయ్...మంటూ పోతున్నాయి కార్లు. వాటి వెనుక జనం పరిగెత్తుతున్నారు. ఊరంతా హడావుడిగా ఉంది. బజారు నుండి వచ్చిన తండ్రిని చూసి "నాన్న ఏమిటి బయట హడావుడిగా వుంది?" అంది సుభద్ర.

"ఈరోజు మన వూరి కొత్త కాలనీ ప్రారంభోత్సవమంట. ముఖ్య అతిథిగా అల్లుడుగారొస్తున్నారంట" అన్నాడు.

సుభద్ర కుతూహలంగా "వెళదామా నాన్నా" అంది.

"నాకు వేరే పనుందమ్మా. నువ్వు వెళ్లిరా దగ్గరే కదా" అని లోపలికెళ్ళాడు. పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు. కొద్ది సమయం తర్వాత బయలుదేరి బైటికి వచ్చింది సుభద్ర. అంతలో "హాయ్...సుభద్రా" అంటూ వచ్చింది అటెండరు ప్రసాద్ భార్య వాణి.

"హాయ్...వాణి ఎక్కడిదాకా?" అంది సుభద్ర.

"ఈరోజు మన వూరి కొత్త కాలని ప్రారంభోత్సవమంట గదా. చూద్దామని వెళుతున్నాను" అంది వాణి. ఇద్దరూ కలసి నడవసాగారు. పట్టుచీరె, ఒంటినిండా నగలు ధరించి వున్న వాణి ప్రక్కన నడవాలంటే సుభద్రకి చిన్నతనంగా వుంది. అంతలో వెనుక నుండి "అమ్మగారు" అంటూ వచ్చాడు రిక్షావాడు.

"ఏమిటి?" అన్నారిద్దరూ.

రిక్షావాడు సుభద్రని తేరిపార చూసి "మీరు రఘురామ్ గారి భార్య కదమ్మా" అన్నాడు.

"అవును"

"అయ్యో బాబోయ్. మీరు నడిచి వెళుతున్నారే

మిటండి. రిక్షా ఎక్కండి తీసుకువెళ్తాను" అని భుజం మీదున్న కండువాను తీసుకొని సీటుని తుడవసాగాడు.

"దగ్గరే కదా నడిచి వెళతాంలే" అంది సుభద్ర.

"లేదమ్మగారు దేవుడిలాంటి అయ్యగారి భార్య నడిచి వెళ్తుంటే మాకు ఎంతో అవమానం. ఎక్కండమ్మా వెళదాం"— వాణి వైపు చూసి "మీరు కూడా ఎక్కండమ్మా" అన్నాడు.

రిక్షా కదిలింది. సుభద్రకి ఆనందంగా వుంది. రిక్షావాడు తనకి ఇచ్చిన మర్యాదకి. రిక్షావాడు "రఘురామ్ గారు దేవుడిలాంటి వాడమ్మా. ఆయన ప్రక్కనే వున్నాడు చీడపురుగు ప్రసాద్. వాడికి మా పేదోళ్ల వుసురు తప్పకుండా తగులుతుంది. మా కడుపు కొట్టి వాడు ఇల్లు కట్టాడు" అన్నాడు.

ఆ మాటలకి కోపమొచ్చింది వాణికి. "ఏయ్ రిక్షా జాగ్రత్తగా మాట్లాడు"అంది. "వాడి గురించి జాగ్రత్తగా మాట్లాడేదేమిటమ్మా. వాడు ఒట్టి వెధవైతే. అయినా వాడిని అంటే నువ్వు బాధ పడుతున్నావేమిటి?"

"ఆయన నా భర్త" అంది కోపంగా వాణి.

వెంటనే రిక్షా ఆపి "ముందు మీరు రిక్షా దిగండి" అన్నాడు.

"ఏ...ఎందుకు?"

"మీరు ఆ వెధవకి భార్య కాబట్టి"

వాణి రిక్షా దిగుతూ "జాగ్రత్తగా మాట్లాడు. నువ్వు అనుకున్నట్లుగా మా ఆయన లంచాలేమి తీసుకోలేదు" అంది.

"లంచాలు తీసుకోకపోతే ఇంత పెద్ద ఆఫీసరు గారి భార్యకి లేని నగలు, బట్టలు అటెంటరు భార్యవి అయిన నీకు ఎలా వచ్చాయి? వెళ్ళు...వెళ్లమ్మా. మీరు జాగ్రత్తగా కూర్చోండి అమ్మగారు" అని వేగంగా పోనిచ్చాడు రిక్షాని.

** ** **

కొత్త కాలని ప్రారంభోత్సవమనే సరికి ఆ వూరి ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు కూడా వచ్చారు. దాంతో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి జనం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దాంతో ఆ ప్రాంతమంతా జనంతో కిటకిటలాడిపోయింది.

రిక్షా వచ్చి ఆగింది. సుభద్ర రిక్షా దిగబోతుంటే ప్రక్కనున్న ఆడవారితో "ఈమె రఘురామ్ గారి భార్య" అన్నాడు రిక్షావాడు. ఆ మాటలు విన్న దగ్గరి ఆడవారితో పాటు దూరాన వున్నవారు కూడా పరిగెత్తుకుంటూ వచ్చారు ఆమెని చూడడానికి. రిక్షా దిగుతున్న సుభద్రని దేవతలాగా చూస్తూ "దండాలమ్మా. అయ్యగారు దేవుడిలాంటోడమ్మా. ఆయన చేతి చలవేనమ్మా ఈ కాలని. మీరు నూరేళ్లు చల్లగా వుండాలమ్మా" అంటూ సుభద్రని అభిమానంతో ముంచెత్తి ప్రక్కకి తీసుకెళ్లి మర్యాదలు చెయ్యసాగారు. వాణి ఒక్కతే వచ్చి బిక్కు బిక్కు మంటూ దూరంగా కూర్చుంది. ఆమెని ఎవరూ పలుకరించలేదు. చూసినా చూడనట్లు పోసాగారు. ఉన్నట్టుండి జనంలో ఒక్కసారిగా కలకలం బయలుదేరింది. జీపులో నుంచి దిగాడు రఘురామ్. ఆయన చాలా సాదాసీదాగా వున్నాడు. జనం ఉరుకులు, పరుగులతో ఆయన్ని చుట్టుముట్టారు. అప్పటిదాకా రాజకీయనాయకుల చుట్టూ, ధనవంతుల చుట్టూ తిరిగిన జనం ఇప్పుడు వాళ్లు పిలిచినా పలికే స్థితిలో లేరు. అదంతా గమనిస్తున్న సుభద్ర ఆలోచనలో పడింది. ఏమిటి ఈ జనమంతా అంత గొప్ప వాళ్లని వదిలిపెట్టి తన భర్త దగ్గరికి పరిగెత్తుతున్నారు. ఆయనతో మాట్లాడాలని ఎందుకు ఉబలాటపడుతున్నారు? ఆయన చేసేది పెద్ద ఉద్యోగమే అయినా డబ్బు విషయంలో చాలా పేదాయన. మరి ఆయన దగ్గర ఏమి వుంది అని చుట్టూ మూగి ఇంత అభిమానం చూపిస్తున్నారు. కాదు... కాదు.నేనేదో పొరపాటు పడుతున్నాను. డబ్బు ద్వారా సాధించలేని అభిమానాన్ని ఆయన దేని ద్వారానో సాధించాడు. దేనిద్వారా?...నీతి... నిజాయితీ ద్వారానా? అవును. వాటి ద్వారానే. అయితే డబ్బు ద్వారా వచ్చే అభిమానం గొప్పదా? లేక నిజాయితీ ద్వారా వచ్చే అభిమానం గొప్పదా? ఏది శాశ్వతం?...ఏది అశాశ్వతం?.. ఇలాంటి ఆలోచనలతో సతమతమవుతున్న సమయంలో ఒకామె పసిపిల్లవాడిని ఎత్తుకుని సుభద్ర దగ్గరికొచ్చి "అక్కా! మా బాబుకి అయ్యగారి పేరు పెట్టుకోవాలనుకుంటున్నాం" అంది.

విశ్చేష్టురాలై సుభద్ర "ఆయన పేరే ఎందుకు పెట్టుకోవాలనుకుంటున్నావు?" అంది.

"ఆయన నిజాయితీకి"

"నిజాయితీకా?"

"అవును అక్కా. ఈ చోటు మా పేదోళ్ళకి దక్కకుండా చేస్తే పెద్ద మొత్తంలో డబ్బిస్తామని ఆశ చూపించారు కొంతమంది ధనవంతులు. అయ్యగారు డబ్బుకి ఆశ పడకుండా నీతిగా వ్యవహరించి మాకు నీడ కల్పించారు. దేవుడంటే ఎక్కడో వుండడక్కా. ఆపదలో వున్న వాళ్లని ఆదుకునే వాడే దేవుడు. అయ్యగారే మాకు దేవుడు".

చలించిపోయింది సుభద్ర ఆ మాటలకి.

"ఇప్పటి వరకూ ఈ జనమంతా రాజకీయనాయకుల మీద, ధనవంతుల మీద తెగ అభిమానం చూపిస్తున్నారు. వాళ్ల మీద చూపే అభిమానం గొప్పదా? అయ్యగారి మీద చూపే అభిమానం గొప్పదా?" అంది సుభద్ర.

ఆ మాటలకామె పకపకా నవ్వి "వాళ్ల దగ్గర డబ్బు, పదవి వున్నంత వరకే ఈ అభిమానమంతా. అవి రెండూ పోయినప్పుడు దాహంగ వుందంటే గుక్కెడు మంచి నీళ్ళు కూడా ఇవ్వరు. అదే అయ్యగారైతే...

ఆయన నిజాయితీని అభిమానిస్తాము. ఆయన చేసిన సహాయానికి జీవితాంతం ఋణపడి వుంటాము. డబ్బు వల్ల వచ్చే కీర్తి ప్రతిష్టల కంటే... నిజాయితీ ద్వారా వచ్చే కీర్తి ప్రతిష్టలే శాశ్వతంగా వుంటాయి. ఆ కీర్తి ప్రతిష్టలే ఆచంద్రతారార్కం. నిలుస్తాయి అంది.


సుభద్ర ఆమెవైపు అలాగే చూస్తుండిపోయింది. అమాయకురాలిలాగా కనిపిస్తున్న ఈమె ఎంత బాగా చెప్పింది జీవిత సత్యాన్ని గురించి. నేను ఎంత అమాయకురాలిని?

నా భర్త గొప్పతనం గురించి వీళ్లకి తెలిసినంత కూడా నాకు తెలియదు అని మధన పడసాగింది.

సభ మొదలయ్యింది.

వక్తలందరూ రఘురామ్ చేసిన సేవలు శ్లాఘిస్తున్నారు. చివరలో ఒకాయన "రఘురామ్ గారు చేసేది పెద్ద ఉద్యోగమే అయినా ఆయన చాలా పేదవాడు" అన్నాడు.

ఆ మాటలు విన్న సుభద్రకి బిగ్గరగా అరవాలనిపించింది, "మేము పేదోళ్లం కాదు. ఇక్కడున్న వారందరికంటే మేమే గొప్పోళ్లం". మా గొప్పతనం ఎప్పటికీ తరగనిది అని.



## నిజమైన హీరో

తొందరపడి తిరుగుబోతును చేసుకోబోతున్నాను రా దేవుడా! అని బాధ పడనవసరం లేని విషయం ఒకటి శిల్పాశెట్టి, అక్షయ్‌కుమార్‌ల మధ్య జరిగింది. ఇద్దరూ సరదాగా సముద్రంలో షికారుకోసం స్పీడ్ బోట్లో వెళ్తే సగం దూరం పోయాక పెట్రోలు అయిపోయింది. దాంతో హీరోగారు నిజంగానే హీరోలా బోటునూ, శిల్పాశెట్టినీ క్షేమంగా ఒడ్డుకు చేర్చి మార్కులు కొట్టేశాడు.